**కథ**

# కర్మయోగి

''రేవతీ ఏంటోయ్ ఇవాళ అన్నం పెట్టే ఆలోచన లేదా? కడుపులో ఎలుకలు పరిగెడుతున్నాయి'' సూర్యవంశి చేతిలో పేపర్ మడుస్తూ గట్టిగా అరిచాడు.

''ఈరోజు మామయ్యగారెందుకో ఇంకా ఇంటికి రాలేదు. ఆయన రాగానే వడ్డిద్దామని చూస్తున్నాను. పోనీ మీకు పెట్టెయ్యమంటారా?'' రేవతి లోపలి నుంచి వస్తూ అడిగింది.

''అవునూ, నాన్న ఇంకా రాలేదేమిటి? పేపర్ చూస్తూ ఆ సంగతే మర్చిపోయాను. టైం తొమ్మిది దాటిందే'' సూర్య కంగారుగా అన్నాడు.

''ఇంత లేటుగా ఎప్పుడూ రాలేదు. ఎక్కడికి వెళ్ళారో ఏంటో'' రేవతి అంటూండగానే గేటు తీసిన చప్పుడు వినిపించింది.

''అదుగో మామయ్యగారు వచ్చేశారు. ఇంక వడ్డించేస్తాను'' రేవతి లోపలికి వెళ్ళబోతూ వస్తున్న మామగారిని చూసి ఒక్క క్షణం ఆగిపోయింది. ఆయన ఒక్కరే రావడం లేదు. ఆయన వెనుక ఓ నడి వయసు స్త్రీ... చిన్న సంచీతో లోపలికి వస్తోంది.

'ఎవరో ఈవిడ. తనకు తెల్సిన దానిలా లేదు' రేవతి మనసులో అనుకుంది.

''సూర్యా! ఈవిడ మన ఊరి ఆవిడే. అదే రామచంద్రాపురం ఆవిడే. అనాథాశ్రమానికి వెళితే అక్కడ కన్పించింది. ఒకప్పుడు బాగా బతికిన కుటుంబంలోంచి వచ్చింది. ఏదో తలరాత బాగాలేక ఈరోజు చితికిపోయి అనాథాశ్రమంలో పిల్లలకి వండిపెడ్తూ జీవితం గడుపుతోంది. కాస్త రేవతికి చేదోడు వాదోడుగా వుంటుంది. అవుట్ హౌస్ గది ఎలాగూ ఖాళీగా ఉంది అక్కడ పడి వుంటుంది అని తీసుకు వచ్చాను. ఈవిడ పేరు జయమ్మ'' సీతారామయ్యగారు సూర్యతో అన్నారు.

సూర్యకెప్పుడూ తండ్రిని ఎందుకు? ఏమిటి? అని ప్రశ్నించే అవసరం ఇంతవరకూ రాలేదు. ఆయన నిర్ణయం తీసుకున్నారు అంటే అన్నివిధాలా ఆలోచించే తీసుకుని ఉంటారు అన్న ధృఢ అభిప్రాయం కూడా వుంది.

'ఇది మామగారు కట్టించిన ఇల్లే. ఆయనకి ఎదురు చెప్పే ప్రసక్తే లేదు. అదీగాక నిజానికి తమ పనిమనుషులతో పడలేక ఇద్దరు చిన్న పిల్లలతో చాలా హైరాన పడుతోంది. పోనీ మనిషి సాయం ఉంటే బానే వుంటుంది' లోలోపల అనుకుంది రేవతి.

జయమ్మ ఇంట్లో ఇట్టే కలిసిపోయింది. ఇంచుమించు అన్ని పనులూ తనే నెత్తిన వేసుకుని చేస్తోంది. అయితే రోజులు గడుస్తున్నకొద్దీ రేవతికి జయమ్మ ఉనికి కాస్త ఇబ్బందికరంగా అన్పించసాగింది. పనిభారం బాగా తగ్గింది. ఎప్పుడైనా పనిమనిషి రాకపోయినా జయమ్మ కుడి ఎడమ చూడకుండా ఇల్లు తుడిచి, అలికి బట్టలు ఉతికేస్తుంది. ఓ రకంగా ఇంట్లో మనిషిలా కలిసిపోయింది. మధ్యాహ్నం వంట అయ్యాక తన గదికి వెళ్ళిపోతుంది. మళ్ళీ రాత్రి వెళ్ళి పడుకుంటుంది. రెండుపూటలా వంటా, టిఫిన్లూ, మధ్య మధ్య ఏ జంతికలో, కారప్పూసో దూసిపోస్తుంది. వంట కూడా చాలా రుచిగా చేస్తుంది. పిల్లల్ని ఎంతో ముద్దు చేస్తుంది. అన్ని విధాలా సౌకర్యంగా ఉన్నా... మామగారు ఆవిడ పట్ల కాస్త ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారు అన్న అభిప్రాయం ఏర్పడిపోయింది. మింగా, కక్కలేని పరిస్థితి.

సూర్యవంశితో అప్పుడప్పుడు ఈ విషయం ప్రస్తావించక తప్పడం లేదు. ఇది ఇద్దరాడవాళ్ళ మధ్య ఉండే సహజమైన అసూయ అని సూర్యవంశి పెద్దగా పట్టించుకోలేదు.

''ఇద్దరూ ఒక్క ఊరివాళ్ళు, చిన్నప్పుడు బాగా తెల్సిన వాళ్ళు... కాస్త చనువుగా పాత విషయాలు, లోకాభిరామాయణం మాట్లాడుకుంటే తప్పేంటి?'' రేవతిని అసభ్యంగా, అసహ్యంగా ఆలోచించ వద్దని చీవాట్లేశాడు సూర్యవంశి.

రేవతికి మామగారంటే చాలా గౌరవం. ఆయనెప్పుడూ రేవతిని చిన్నమాట కూడా అనలేదు. రేవతికి అన్ని విధాలా సహకరిస్తూ, సర్దుకుపోతూ వచ్చాడు. కానీ రేవతికి ఈమధ్య ఆయన వరస నచ్చడం మానేసింది. ఏదో ఎవరూ లేక పడివుంది అని ఆశ్రయం ఇచ్చారు జాలిపడి... బావుంది... కానీ మరీ అంత సన్నిహితంగా మెలగాలా? జయమ్మ కూడా ఇంట్లో కాస్త ఎక్కువ స్వతంత్రంగా ఉంటోందా? అని కూడా అన్పిస్తోంది. పిల్లలు మొదట్లో ఆవిడని ''వంట మామ్మ'' అంటూంటే మామగారు మందలించి ''మామ్మగారు'' అని పిలవడం నేర్పించడం ఆ సమయంలో తప్పుగా అన్పించకపోయినా ఇప్పుడు నచ్చటం లేదు రేవతికి. రవి, రవళి స్కూల్‌కి వెళ్ళేటప్పుడు 'టాటా' చెప్తారు తాతగారికి. ''మామ్మగారికి కూడా చెప్పండి'' అని సీతారామయ్యగారు పిల్లలతో ఆవిడకి 'టాటా' చెప్పించడం, ఆవిడ పిల్లలు స్కూల్‌కి వెళ్ళే టైములో బయటికి రావడం రేవతికి చిరాకేస్తోంది.

సీతారామయ్యగారు ఆవిడ ఆరోగ్యం గురించి ఆదుర్దా పడడం, ఆరా తీయడం, మందులు తెచ్చివ్వడం... వాళ్ళ మధ్య చనువు మరీ పెరిగి తప్పుతోవ పట్టదు కదా అన్పిస్తోంది. ఇరుగు పొరుగు కూడా వాళ్ళ మధ్య కాస్త చనువుఎక్కువే అన్న అభిప్రాయం వెలిబుచ్చారు. ఆవిడ ఎవరో, ఏంటో పూర్తిగా తెలుసుకోకుండా ఇంట్లోకి పిలుచుకురావడం సరియైన పనికాదు. ముందే జాగ్రత్త పడి ఉండాల్సింది అని కూడా అన్నారు రేవతితో.

ఆమధ్య రేవతి, సూర్యవంశి పిల్లలతో సినిమాకి వెళ్ళినప్పుడు వాళ్ళిద్దరూ దొడ్లో నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ అక్కడే ఫలహారం కూడా చేశారుట. ఇలాంటి మాటలు వినలేక జయమ్మని ఇంట్లోంచి పంపించి వేస్తే బావుంటుందనిపిస్తోంది రేవతికి. ఇప్పుడిప్పుడే.

రేపేదైనా అనుకోని సంఘటన జరిగినా తనే తెలివి తక్కువగా ప్రవర్తించింది అంటారు లోకులు.

పిల్లల కోసం అంటూ అప్పుడప్పుడు జయమ్మ రవినీ, రవళినీ తీసుకుని పార్క్‌కి వెళ్తోంది. సీతారామయ్యగారు రోజూ పార్క్‌కి వెళ్తూనే వుంటారు స్నేహితులతో కాలక్షేపం చెయ్యడం కోసం. కొంతమంది కలిసి 'వృద్ధ సంఘం' పెట్టుకున్నారు. దాంట్లో భాగంగా అప్పుడప్పుడు అనాథాశ్రమాలకి వెళ్ళి అందరి ఇళ్ళల్లోంచి సేకరించిన పాతబట్టలు, పుస్తకాలు, పెన్సిళ్ళు, మేగజైన్స్ అక్కడి పిల్లలకి ఇస్తూ ఉంటారు. అలాగే ఆడవాళ్ళ బట్టలూ, గిన్నెలూ, చెంబులూ ఇంకేమైనా పాత సామాన్లు ఉంటే 'నారానికేతన్' లాంటి సంస్థలకి అందజేస్తూ ఉంటారు. సీతారామయ్యగారు 'వృద్ధ సంఘం'లో చాలా యాక్టివ్‌గా ఉంటారు. దానికోసమే రోజూ పార్క్‌లో కలుసుకుని తమ ప్రణాళికల గురించి చర్చిస్తూ ఉంటారు. ఈమధ్య వృద్ధ

సంఘం వాళ్ళు వెళ్ళిపోయాక జయమ్మతో కాస్సేపు కబుర్లు చెప్పుకుని ఇద్దరూ పిల్లల్ని తీసుకువస్తున్నారు. అలా వచ్చే వాళ్ళని చూస్తే ఎవరికైనా పిల్లల మామ్మా, తాతయ్యా అనే అన్పిస్తుంది. సూర్యవంశితో అంటే ''పితూరీలు చెప్పకు'' అంటూ చిరాకు పడ్డాడు రేవతి మీద.

రోజులు, నెలలు గడిచి దాదాపు ఒక సంవత్సరం అయింది జయమ్మ వచ్చి. )

''ఎల్లుండి మా అత్తగారి తద్దినం. కాస్త తడిబట్ట కట్టుకుని చేయాలి'' రేవతి అంది.

''తద్దినమా!'' జయమ్మ మొహం వివర్ణమైపోయింది.


''ఓ... ఎల్లుండి. ఆషాఢమాసం. సప్తమీ కదూ... బ్రాహ్మలకి చెప్పలేదు కదమ్మా. పోనీ ఈసారి నేను మఠంలో పెట్టించేస్తాలే. పిల్లలకి పరీక్షలు అవుతున్నాయి కూడా'' అక్కడే వున్న సీతారామయ్యగారన్నారు.

రేవతి మామగారి వంక విచిత్రంగా చూసింది. ఇదివరకెప్పుడూ ఇలా మాట్లాడలేదు. అప్పుడు మాత్రం ఎన్ని సార్లు పరీక్షలు, వేరే ఇబ్బందులు రాలేదు.

''నిన్న సాయంత్రం బాపన్నశాస్త్రిగారు వచ్చి ఎల్లుండి వస్తామని చెప్పి వెళ్ళారు. నిన్న సాయంత్రం మీరు పార్కునుంచి చాలా ఆలస్యంగా వచ్చారు. చెప్పడం మర్చిపోయాను''

జయమ్మ తడిబట్ట కట్టుకుని వంటంతా చేసింది తద్దినం రోజు. సూర్యవంశి భక్తిగా తల్లి తద్దినం పెట్టాడు ప్రతి ఏడాది లాగే. తద్దినం అయిన మర్నాడు జయమ్మ మంచం మీద పడింది. తడిబట్ట కట్టుకోవడం, చాలా పెద్ద వంట కావడం వల్ల ఏమో, పదిరోజులు మంచం దిగలేదు.

రేవతికి ఆ పది రోజులూ ఆవిడ సేవ చెయ్యవలసి వచ్చింది. టైముకి మందు, వేళ వేళకీ జీర్ణమయ్యే ఆహారం ఇవ్వడం, రేవతి పన్లో ఉంటే సీతారామయ్యగారు ఆవిడకి కావాల్సినవి అమర్చేవారు. జయమ్మ మరీ అంత ఆరోగ్యవంతురాలు కాదు. పనికి వెరవక చేస్తుంది కానీ, ఇలా మాటిమాటికి మంచం పడ్డే కష్టమే. ఈవిడని మెల్లిగా ఎలాగైనా మళ్ళీ ఆశ్రమానికి పంపిస్తే బావుంటుంది అన్పిస్తోంది రేవతికి.



''నేను ఆశ్రమానికి వెళ్ళిపోతాను'' ఓ నెల్లాళ్ళ తర్వాత జయమ్మ డైనింగ్ టేబుల్ మీద వడ్డిస్తూ అంది. రేవతికి ఆవిడ మాటలు చెవుల్లో అమృతం కురిసినట్టు అన్పించాయి.

''రేవతి ఊరికెళ్తోంది కదా. వచ్చాక వెళ్దువుగాని'' సూర్యవంశి అన్నాడు. సూర్యవంశి మాటలు మరీ ఇంపుగా విన్పించాయి రేవతికి.

మామగారు, సూర్యవంశి అడ్డు చెప్పకపోవడం చాలా రిలీఫ్‌గా ఉంది. ''రేపు రాత్రి నేను మా అన్నయ్య కొడుకు ఒడుగుకి వెళ్ళివస్తాను. వచ్చాక వెళ్ళండి. అయినా ఇక్కడ మీకు ఏం లోటు చేశామని''

''లోటు చేశారని కాదు. అక్కడి పిల్లలు గుర్తుకు వస్తున్నారు. వెళ్ళినా అప్పుడప్పుడు కన్పిస్తానుగా...''

సూర్యవంశి కానీ, సీతారామయ్యగారు కానీ ఆవిడని వారించకపోవడం వల్ల నిశ్చింతగా ఉంది రేవతికి.

''నేను ఊరికి వెళ్తున్నాను. ఎంత, వారంలో వస్తాను. వచ్చాక వెళ్దురు గానీ'' రేవతి అంది.

రేవతి రాగానే ఈవిడకి ఉద్వాసన చెబితేనే మంచిది అనుకున్నాడు సూర్యవంశి కూడా. రేవతి మామగారితో ఆవిడ కాస్త ఎక్కువ చనువుగా ఉంటుంది అన్నది మొదట్లో చాడీలా కన్పించినా తర్వాత తర్వాత సూర్యవంశికి కూడా వాళ్ళమధ్య కేవలం ఒక ఊరివాళ్ళు, బాగా తెల్సిన వాళ్ళు కాకుండా ఆత్మీయుల్లా కన్పించారు. ఓ అర్ధరాత్రి మంచినీళ్ళకని లేచిన సూర్యవంశికి తండ్రి అవుట్‌హౌస్ ముందు జయమ్మతో గుసగుసగా మాట్లాడటం చూసినప్పటి నుంచి రేవతి మాటల్లో కాస్త నిజం ఉంది అన్న అభిప్రాయానికి వచ్చాడు సూర్య

ఎమ్.నాగలక్ష్మి

వంశి.

రేవతి తిరిగి రాగానే జయమ్మగారిని పంపించె య్యాలి అనుకున్నాడు రేవతిని రైలెక్కించి వస్తూ సూర్యం.

''హలో మనోజ్! నేను సూర్యాన్ని. ఏంటి నిన్న రేవతికి కన్పించావుట బజార్లో. అర్జెంట్‌గా నన్ను కలవమన్నావుట. కొంపదీసి పెళ్ళి చేసుకో వడం లేదుకదా!'' సూర్యవంశి పకపకా నవ్వుతూ అన్నాడు.

సూర్య, మనోజ్ చిన్ననాటి స్నేహితులు. సూర్య ఇంజనీర్ అయితే మనోజ్ లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడు.

''పిచ్చి జోకులు జోకక, నీ కొంప మునగ కుండా ఉండాలంటే అర్జెంట్‌గా రేపు వచ్చి కన బడు. మళ్ళీ నేను ఊరికెళ్తున్నాను. వారం ఉండను. అర్జెంట్. అర్థమయిందా?''

మనోజ్ మాటలు విస్మయం కల్గించాయి. అంత అర్జెంట్‌గా తనకి కీడు కల్గించే మాటర్ ఏమై వుంటుందో... రేపు పొద్దున్నే వెళ్ళిరావాలి ఎలాగూ ఆదివారమే- అనుకుంటూ నిద్రపో యాడు సూర్యవంశి.

★★★

ఇంటిముందు గుంపులుగా ఉన్న జనాన్ని చూసి కంగారుపడిపోయాడు సూర్య. అయ్యో తండ్రికేమయిందో? మూడు గంటల ముందు వరకూ బాగానే ఉన్నారు. ఇంతలో ఆయన్ని ఒంటరిగా వదలి వెళ్ళడం తనదే తప్పు. ఆందోళ నతో లోపలికి వచ్చిన సూర్యవంశికి సీతారామ య్యగారు అరుగు వారగా కూర్చుని వుండటం కన్పించి కుదుట పడ్డాడు.

'పాపం ఎక్కడ పుట్టిందో, ఎలా బతికిందో ఆఖరికి ఇక్కడ పోయింది' సూర్య దృష్టి అప్పుడే పడింది సందులో పెట్టిన జయమ్మ శవం వైపు. అయ్యో! పొద్దున్న కాఫీ, టిఫిన్ అన్నీ అమ ర్చింది. ఇంతట్లో పాపం...

''పాపం - ఏంటి. బాగా అయింది. మనోజ్ రేవతితో ఈవి డని చూసాడు కాబట్టి అన్ని విష యాలు తెలిసాయి. ఎలా నంగనా చిలా ఉండేదో. ఎంత జాణ. గతం దాచి హాయిగా ఇంట్లో దూరిపో యింది. మనోజ్‌ని ఈవిడ గుర్తు పట్టింది కాబట్టే ఆశ్రమానికి వెళ్ళిపో తాను అంది. అమ్మో ఎంత నాటకం''

''మున్సిపాలిటీ వాళ్ళకి కబురు చేస్తే వాళ్ళే పట్టుకుపోతారు''

''ఆశ్రమం వాళ్ళకి కబురు పెడ్తే వాళ్ళే చూసుకుంటారు''

''మన వృద్ధ సంఘం ఎంతోమంది అనాధలకి అంతిమ సంస్కారం చేస్తోంది. ఈవిడ సీతారామ య్యగారింట్లో ఉంది ఇన్నాళ్ళూ. మనమే చేద్దాం... చలమయ్య కొరివి పెడ్తాడు'' అనంత మూర్తిగారన్నారు.

''కాదు. సూర్య చేస్తాడు'' సూర్యవంశి తండ్రి వంక కళ్ళు పెద్దవి చేసుకుని చూసాడు.

''ఔను.. పెద్దావిడ. సూర్య చేస్తే కొడుకు చేసినట్లే ఉంటుంది. ఇన్నాళ్ళూ పాపం ఇంట్లో వుండి అందరికీ సేవచేసింది.''

''ఔనౌను. అది మానవధర్మం కూడా'' సీతారామయ్యగారు నిజంగా ధర్మమూర్తి. ఇంట్లో మనిషి పోయింది కదా అలా వదిలేసే ఆయన కాదు''

సీతారామయ్యగారిని ఆయన మిత్రులంతా పొగుడుతున్నారు.

''నాన్నా మీతో కొంచెం మాట్లాడాలి. లోప లికి వస్తారా'' సూర్య నోరు పెగల్చుకుంటూ అన్నాడు.

''నాన్నా అదెవరో మీకు తెలియదు. ఆవిడకి నేను కొరివి పెట్టడం ఏమిటి? డబ్బిచ్చి చేయిద్దాం. అంతేకానీ, ఛీ...ఛీ... అలాంటి దానికి...'' సూర్య లోపలికి వచ్చిన తండ్రితో చిన్నగా అన్నాడు.

''ఆవిడెవరో నీకు తెలుసా'' సీతారామయ్య గారు నిర్వికారంగా అడిగారు.

''ఆ... మనోజ్ ఇవాళ చెప్పాడు కాబట్టి తెలి సింది. ఛీ... హత్య చేసి పధ్నాలుగేళ్ల జైలుశిక్ష అనుభవించిన ఆవిడని మీరు తెలియక ఇంటికి తీసుకువచ్చారు''

''నాకు తెలుసు ఆ సంగతి''

''ఆవిడ హంతకురాలని తెలిసే ఇంటికి తీసు కువచ్చారా?'' సూర్య నిర్ఘాంతపోయాడు.

''ఊ... మనోజ్ నుంచి చాలానే తెల్సుకు న్నావు కానీ, తెలియంది ఇంకా ఎంతో ఉంది. అందుకే జయమ్మ అంతిమ సంస్కారం నిన్ను చెయ్యమన్నది''

''ఛీ... అలాంటి హంతకురాలికి...''

''సూర్యా! ఆవిడ హంతకురాలే కాదు... నీ తల్లి కూడా''

సూర్య బిగుసుకుపోయాడు. తండ్రివైపు చూశాడు. సీతారామయ్యగారి మొహం నిర్వికా రంగా ఉంది. ఆ మొహం ఏ భావమూ ప్రస్ఫుటం చేయటం లేదు. కానీ ఆయన పచ్చి నిజం చెప్తున్నారన్నది మాత్రం అర్థమవుతోంది.

''నీకు రెండేళ్ళు ఉన్నప్పుడు మీ అమ్మ విజయ, సినిమాల్లో చేరాలన్న పిచ్చితో ఎదు రింటి వాడితో మద్రాస్ వెళ్ళిపోయింది. అప్పటి నుంచీ నేను ఊరు మార్చి మీ అమ్మ చచ్చిపో యిందని అందరికీ చెప్తూ ఒంటరిగా బతుకు న్నాను. మూర్తి తనని సినిమాల్లో చేర్పేకంటే తార్చి డబ్బు చేసుకోవాలనుకుంటున్నాడని విజయ తెల్సుకుని అతన్ని చంపి జైలుకెళ్ళింది. మొన్నామధ్య ఆశ్రమంలో చూసే వరకు ఆ సంగ తులేవీ నాకూ తెలియదు. ఆరోగ్యం పాడయి చావుకి చేరువలో ఉంది. ఆఖరి రోజులు ప్రశాం తంగా గడుపుతుందని ఇంటికి తీసుకువచ్చాను. ఎంతోమందికి ఎన్నో రకాలుగా సహాయం చేస్తాం. ఎంత కాదనుకున్నా ఈ మనిషి నీ తల్లి! అంతిమ సంస్కారం చేసి నీ కర్తవ్యం నువ్వు నెరవేర్చు'' సీతారామయ్యగారు ఒక కర్మయోగిలా కన్పిం చారు ఆ క్షణాన సూర్యానికి.

ఇరుగు పొరుగు తండ్రీ కొడుకుల్ని మెచ్చుకు న్నారు, వంటమనిషి అని ఏదో బయటికి ఈడ్చి పడెయ్యకుండా చక్కగా అంతిమ సంస్కారం జరిపించారు అని. సీతారామయ్యగారు నిజంగా ఉన్నత హృదయుడు, సంస్కారి అని అందరూ పొగిడారు.

పదిరోజుల తర్వాత వచ్చిన రేవతి జరిగింది విని ఆశ్చర్యపోయింది.

''మంచిపనే చేశారు. పోనీ మన పంచన చేరింది... అనాధ సంస్కారం పుణ్యకార్యం'' అంది తప్ప స్వయంగా చేతులతో తద్దినం వంట చేసి తన తద్దినం తనే చూపిన దౌర్భా గ్యురాలు జయమ్మ తన అత్తగారు అన్న సంగతి రేవతికి ఎప్పటికీ తెలి యదు. కనీసం ఊహించను కూడా లేదు.

